ఎల్లమ్మా.. ఈ పనులయ్యేది ఎప్పుడమ్మా?

- ఏళ్లు గడుస్తున్నా ముందుకుసాగని బల్కంపేట పార్కింగ్ కాంప్లెక్స్ పనులు
- రూ.3 కోట్ల బిల్లులు రాక చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- 2017లో పనులు ప్రారంభం.. జీ ప్లస్ 2 వరకే స్లాబ్ పూర్తి
- జీ ప్లస్ 6కు చేపట్టాలని నిర్ణయం
- కల్యాణ మండప నిర్మాణానికి వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన పీఎం మోదీ
- అధికారుల పర్యటనలు, పరిశీలనలకే పరిమితమైన పనులు


అర్ధాంతరంగా నిలిచిన మల్టీలెవల్ పార్కింగ్ భవన నిర్మాణం

అమీర్‌పేట, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): ఎంతో ప్రసిద్ధి చెందిన బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. 2022లో ప్రారంభం అయిన మల్టీలెవల్ పార్కింగ్ కాంప్లెక్స్ పనులకు దేవాదాయ శాఖ కమిషనర్ నిధుల విడుదలకు అనుమతి ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ సంవత్సరం క్రితం పనులను అర్ధాంతరంగా నిలిపివేశాడు. ముందుగా జీప్లస్-2గా అంచనాలు వేసిన దేవాదాయ శాఖ దీన్ని జీప్లస్-6కు మార్చింది. మొదట నిర్ణయించిన టెండర్ ప్రకారం పనులు పూర్తి చేసినప్పటికీ సుమారు రూ.3కోట్ల వరకు బిల్లులు చెల్లించడంలేదని కాంట్రాక్టర్ మొత్తుకుంటున్నాడు. ఈ విషయమై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం అందజేసినా ఫలితంలేకుండా పోయిందని కాంట్రాక్టర్ ఆవేదన వ్యక్తంచేస్తున్నాడు. కాగా కేంద్ర టూరిజం విభాగం నిర్మిస్తామన్న కల్యాణమండపం పనులు ఇంకా మొదలు పెట్టనేలేదు. రాష్ట్రదేవాదాయశాఖ పలకదు.. కేంద్ర టూరిజం విభాగం ఉలకదు అన్న చందంగా పరిస్థితి తయారైంది. దీంతో దేవాలయానికి వచ్చే వేలాది మంది భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు.

చూస్తున్నారు.. వెళ్తున్నారు..

దేవాలయం వద్ద 400 గజాల్లో ఉన్న కల్యాణ మండపం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. కాగా ఈ కల్యాణ మండపాన్ని కూలగొట్టి ఆధునిక సౌకర్యాలతో ఐదంతస్థుల భవనాన్ని ప్రసాదం పథకంలో భాగంగా రూ.4.40 కోట్లతో నిర్మించడానికి కేంద్ర టూరిజం విభాగం 2022 సెప్టెంబర్‌లో ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా భవన నమూనా రూపొందించారు. ఈ సంవత్సరం మార్చిలో ప్రధాని నరేంద్ర మోదీతో వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. తర్వాత కేంద్ర టూరిజం విభాగం వారు వస్తున్నారు..చూస్తున్నారు.. వెళ్తున్నారే తప్ప ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు. ప్రజాప్రతినిధులు నిర్మాణాల పూర్తికి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.


నూతన పార్కింగ్ భవనం నమూనా

సంవత్సరాలు గడుస్తున్నా ముందుకు సాగని పనులు

బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతరరాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. వీరంతా తమ వాహనాలను పార్కింగ్ చేయడానికి స్థలం లేక అవస్థలు పడుతున్నారు. రహదారులపై ఎక్కడ పడితే అక్కడ నిలుపుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని 2017లో ఆధునిక సౌకర్యాలతో కూడిన ఆరు అంతస్థుల్లో మల్టీలెవల్ పార్కింగ్ కాంప్లెక్స్‌ను రూ.5.60 కోట్లతో నిర్మించాలని నిర్ణయించారు. మొదట్లో పనులు చకచకా జరుగగా.. పునాది తవ్వకాల్లో రాతిపొరలు ఉండడంతో మొదట గుత్తేదారు తప్పుకున్నాడు. తర్వాత కరోనాతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. అప్పుడు మంత్రిగా ఉన్న తలసాని శ్రీనివాస్‌యాదవ్ చొరవతో 1,165 గజాల్లో దేవస్థానమే ఈ కాంప్లెక్స్ నిర్మాణ పనులను చేపట్టాలని నిర్ణయించింది. పనులు మళ్లీ మొదలై.. మూడుస్లాబులు వేసిన అనంతరం గుత్తేదారుకు డబ్బులు చెల్లించలేదు. దీంతో కాంట్రాక్టర్ తప్పుకున్నాడు. దేవస్థానానికి సంబంధించిన నిధులు బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో ఉన్నాయి. వీటిని తీయాలంటే రాష్ట్ర ప్రభుత్వం అనుమతి కావాలి. దేవాదాయ శాఖ కమిషనర్ ఇందుకు అనుమతి ఇవ్వడంలేదు. దీంతో మల్టీలెవల్ పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. మరో మూడు స్లాబ్‌లతోపాటు మిగతా పనులు పూర్తిచేయాల్సి ఉంది.

శాంతిభద్రతల పరిరక్షణలో
వెనకడుగు వేసేది లేదు

- బంజారాహిల్స్ డివిజన్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి

ఇంటర్వ్యూ...

బంజారాహిల్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు వీఐపీ బందోబస్తు... మరోవైపు వైట్ కాలర్ నేరాలు.. ఇంకోవైపు రౌడీషీటర్ల కదలికలు.. మరోవైపు ధనవంతుల ఇళ్లలో చోరీలు.. అక్కడ చీమ చిటుక్కుమన్నా పెద్ద సంచలనమే. కొన్ని సందర్భాల్లో రాష్ట్ర రాజకీయాలను సైతం ప్రభావితం చేసే సంఘటనలు ఇక్కడే చోటు చేసుకుంటాయంటే అతిశయోక్తి కాదు. ఇలాంటి చోట పోలీసింగ్ చేయడం కత్తి మీద సాము లాంటిదే. కానీ ప్రజలను, సిబ్బందిని సమన్వయ పరుస్తూ జాగ్రత్తగా వ్యవహరిస్తే అంతా సవ్యంగా సాగుతుందని అంటున్నారు బంజారాహిల్స్ డివిజన్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు పోలీసులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని స్పష్టంచేశారు. మరిన్ని విషయాలను గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.



వీఐపీ బందోబస్తు.., నేరాల అదుపు రెండింటినీ ఎలా సమన్వయం చేస్తున్నారు?

పోలీసింగ్ అంటేనే మల్టీ టాస్కింగ్. విధుల్లో చేరే ముందు శిక్షణ కూడా అలాగే ఉంటుంది. ఎన్ని బందోబస్తులు ఉన్నా.. వీఐపీ ఇళ్ల వద్ద విధులు నిర్వహించినా శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా తగుచర్యలు తీసుకుంటూనే ఉంటాం. అందుకే నేరస్థులను ఠాణాకు పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వడం, ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీచేయడం లాంటివి చేస్తుంటాం. రౌడీషీటర్లు, గలాటాలు చేసే వారి ఉనికిపై ఎప్పటికప్పుడు ఓ కన్నేసి ఉంచుతాం. ఏ మాత్రం అనుమానం వచ్చినా వారి ఇళ్లలో తనిఖీలు చేయడంతో పాటు అదుపు తప్పితే కేసులు పెట్టి జైలుకు పంపిస్తాం. అయినప్పటికీ తీరు మార్చుకోకపోతే పీడీయాక్ట్ నమోదు చేస్తున్నాం. కొన్ని సందర్భాల్లో వీఐపీ బందోబస్తులు నిర్వహించినప్పుడు ప్రతిపక్షానికి చెందిన వారు లేదా ఆందోళనకారులు నిరసన తెలిపే ప్రమాదం పొంచి ఉంటుంది. అందుకే సందర్భాన్ని బట్టి అందరినీ ఓ కంట కనిపెడుతూ పోలీసింగ్‌ను నిర్వహిస్తున్నాం.

యువత డ్రగ్స్ బారిన పడుతున్నారు. వారిలో మార్పుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఇటీవల వయసుతో నిమిత్తం లేకుండా చాలామంది డ్రగ్స్, గంజాయి ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారు. వీరికి మత్తు పదార్థాలు సరఫరా చేసే వారిపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నాం. ముఖ్యంగా కొన్ని దేశాలకు చెందిన వారు నగరంలో ఉంటున్న ప్రాంతాల్లో నిఘా పెంచాం. వారి కదలికలను పసిగట్టి డ్రగ్స్ అమ్ముతున్నట్టు తేలితే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నాం. పబ్‌లలో డ్రగ్స్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. పబ్ నిర్వాహకులకు హెచ్చరికలు జారీచేస్తున్నాం. అయితే డ్రగ్స్ తీసుకోవడం కూడా చట్టం దృష్టిలో తప్పే అవుతుంది. ఇలా డ్రగ్స్ తీసుకున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చే సమయంలో అనేక ఆసక్తికరమైన విషయాలు తెలిసాయి. చాలామంది పిల్లల తల్లిదండ్రులు ఇందుకు బాధ్యత వహించాల్సివస్తుంది. స్వేచ్ఛ పేరిట పిల్లలు అడిగినంత డబ్బు ఇచ్చి వాటిని ఏం చేస్తున్నారు అనే దానిపై దృష్టి పెట్టకపోవడంతో వారు దారితప్పుతున్నారు. ఇలాంటి కేసుల్లో తల్లిదండ్రులకు కూడా కౌన్సెలింగ్ ఇస్తున్నాం. ఎంతో భవిష్యత్ ఉన్న యువత మత్తులోకి వెళుతుంటే మాకూ చాలా బాధగానే ఉంటుంది. అందుకే మత్తుపదార్థాలను అరికట్టేందుకు మా వంతు కృషి చేస్తున్నాం.

ఇళ్లలో చోరీలను అరికట్టడానికి తీసుకుంటున్న చర్యలు ఏవీ?

ధనవంతుల ఇళ్లలోనే కాదు ఎక్కడ కూడా దొంగతనం జరగొద్దు అనేది మా ఉద్దేశం. అందుకే సీసీ కెమెరాల సంఖ్య పెంచాం. దీంతో చోరీలు తగ్గాయి. ఇంటి యజమానులు కూడా స్వీయ రక్షణ కోసం సీసీకెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నాం. కొంతమంది పాటిస్తున్నారు.. మరికొంత మంది పెడచెవిన పెడుతున్నారు. అయినప్పటికీ సమస్యాత్మక ప్రాంతాల్లో కానిస్టేబుల్ ప్రతి రోజూ రాత్రి, పగలు సమయాల్లో పెట్రోలింగ్ చేస్తూ నిఘా పెంచుతున్నాం. చాలా సందర్భాల్లో ఇళ్లలో పనిచేసే వారు చోరులుగా తేలుతున్నారు. అందుకే పనివారిని పెట్టుకునే ముందు తగు జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. ఎవరైనా ఊరెళ్లాలి అనుకున్నప్పుడు మాకు సమాచారం ఇస్తే బీసీ కానిస్టెబుల్ ఎల్లప్పుడూ నిఘా ఉంచేలా జాగ్రత్తలు తీసుకుంటాం.

రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న మైనర్ల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

హిల్స్ రోడ్లపై ఖరీదైన వాహనాలతో యువత రెచ్చిపోవడం... ప్రమాదాలకు కారణం కావడం తరచూ జరుగుతున్నాయి. ఇలాంటి వారిని అదుపులోకి తీసుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం. అంతేకాకుండా మైనర్లు వారికి వాహనాలు కొనిచ్చిన తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. వారిలో మార్పు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం.

రేవంత్ పాలనలో 20 మతపరమైన ఘటనలు

- మతతత్వాన్ని నియంత్రించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి
- జైనూర్‌లో శాంతిభద్రతలను పునరుద్ధరించాలి : వివిధ సంఘాల నేతలు

పంజాగుట్ట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ముస్లింలకు అభద్రతాభావం మొదలైందని, మతతత్వాన్ని నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని వివిధ సంఘాల నాయకులు, పలువురు సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేశారు. జైనూర్‌లో శాంతిభద్రతలను పునరుద్ధరించాలని, హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలో స్వతంత్ర విచారణ కమిషన్‌ను ఏర్పాటుచేయాలని వారు కోరారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో సామాజిక కార్యకర్తలు ఖలీదాపర్వీన్, సారామాథ్యూస్, మసూద్, న్యాయవాది ఎంఏ.షకీల్, ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్‌అబ్దుల్‌అజీజ్, బాంసెఫ్ ప్రతినిధి డాక్టర్ కుమార్, వివిధ సంఘాల నాయకులు మాట్లాడారు. రాష్ట్రంలో మతహింస పెరుగుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మతోన్మాద శక్తులు కొత్త బలం పుంజుకున్నాయని అన్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవడానికి బదులు, మతతత్వ శక్తులఒత్తిడికి తలొగ్గిన పోలీసులు తరచూ ఇరువర్గాలపై కేసులు పెడుతున్నారని అన్నారు. కొన్ని సందర్భాల్లో అసలు నేరస్థుల కంటే ఎక్కువ మంది అమాయక యువత చిక్కుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ పాలనలో ఇప్పటి వరకు 20 చిన్న, పెద్ద మతపరమైన సంఘటనలు జరిగాయని అన్నారు. జైనూర్ ఘటన జరిగి 50 రోజులు కావస్తున్నా ఆ ప్రాంతంలో సాధారణ పరిస్థితులు నెలకొనలేదని, అక్కడ అప్రకటిత కర్ఫ్యూ కొనసాగుతుందని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను పర్యవేక్షించేందుకు అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటుచేయాలని వారు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు.

హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలో స్వతంత్ర విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. కర్ణాటక ప్రభుత్వం వలే ద్వేషపూరిత ప్రసంగ చట్టాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సయ్యద్ మహ్మద్ అబ్దుల్ ఖదీర్, అలీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు దేశవ్యాప్తంగా స్పందన


బీజేపీ సభ్యత్వ నమోదును నిర్వహిస్తున్న యువమోర్చా రాష్ట్ర ప్రధానకార్యదర్శి సురేష్‌జి తదితరులు

ఎర్రగడ్డ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదుకు దేశవ్యాప్తంగా విశేష స్పందన లభిస్తుందని యువమోర్చా తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సురేష్‌జి అన్నారు. గురువారం బీజేపీ ఎర్రగడ్డ డివిజన్ యువమోర్చా అధ్యక్షుడు అనికేత్‌యాదవ్ ఆధ్వర్యంలో ఎర్రగడ్డలోని రైతుబజార్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుబజార్‌లో రైతులకు, వినియోగదారులకు సభ్యత్వాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు దర్శనం నాగేశ్వరరావు, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ ప్రధానకార్యదర్శి పిట్లం అవినాష్, ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షుడు ఈదులకంటి రాజేష్, యువ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి గణేష్, నాయకులు సాగర్, అనిల్, శివ, చింటూ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కారుకు సైరన్ తొలగింపు


ఎమ్మెల్యే వాహనానికి ఉన్న సైరన్‌ను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసు

బంజారాహిల్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ఓ ఎమ్మెల్యే కారుకు ఉన్న సైరన్‌ను పోలీసులు తొలగించారు. జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు రెండు రోజులుగా సైరన్, బ్లాక్ ఫిలింపై ప్రత్యేకడ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం తనిఖీలు చేస్తుండగా ఓ కారుకు సైరన్ ఉన్నట్టు గుర్తించారు. విచారణలో అది ఏపీలోని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి సంబంధించినదని తేలింది. పోలీసులు సైరన్‌ను తొలగించి వదిలేశారు.

తమ్ముడి భార్యతో అన్న అసభ్యప్రవర్తన

బంజారాహిల్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తమ్ముడి భార్యతో అసభ్యంగా ప్రవర్తించిన అన్నపై కేసు నమోదైంది. బంజారాహిల్స్ ఫస్ట్‌ల్యాన్సర్‌లో నివాసముండే మహ్మద్‌కు కొద్దికాలం క్రితం ఓ మహిళతో వివాహం జరిగింది. కాగా వీరితోనే ఉంటున్న మహ్మద్ అన్న మహ్మద్ పాషా ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించడం మొదలు పెట్టాడు. హెచ్చరించినా మారలేదు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో పోలీసులపై దాడి

ముగ్గురు యువకుల అరెస్ట్

బంజారాహిల్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో పోలీసులపై దాడి చేసిన ముగ్గురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్ పోలీస్ కానిస్టేబుల్ రాజు, హోంగార్డు శేఖర్ ఈనెల 23న అర్ధరాత్రి శాలివాహన నగర్‌లో విధినిర్వహణలో ఉన్నారు. అదే సమయంలో కార్తీక్, అశోక్ అనే అన్నదమ్ములతోపాటు వారిస్నేహితుడు మోహన్ పీకల దాకా మద్యం తాగి రోడ్డుపై తిరుగుతున్నారు. వీరిని చూసిన పోలీసులు ఈ సమయంలో ఇక్కడ ఏం చేస్తున్నారని ప్రశ్నించి ఇంటికి వెళ్లండి అంటూ సూచించారు. అయితే మద్యం మత్తులో ఉన్న ముగ్గురు ఆగ్రహంతో ఊగిపోతూ పోలీసులపై తిరగబడ్డారు. అయినా పోలీసులు ఓపికగా ముగ్గురినీ ఇంటికి పంపించేందుకు ప్రయత్నించగా తీవ్రంగా దాడిచేశారు. ఈ మేరకు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు ముగ్గురినీ అదుపులోకి తీసుకొని విచారించారు. కార్తీక్ డీజే ప్లేయర్ కాగా అశోక్, మోహన్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌లు. వీరిపై పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆసుపత్రిలో తల్లీకుమార్తె అదృశ్యం

బంజారాహిల్స్ అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో తల్లి, కుమార్తె అదృశ్యమయ్యారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు5లో నివసించే ఖాజా అలియాస్ అహ్మద్ పండ్ల వ్యాపారి. ఈనెల 21న కరీంనగర్ జిల్లా నుంచి అతని సోదరి నిషాఫిర్దోస్, ఆమె కుమార్తె జిషా ఖాన్ అతని ఇంటికి వచ్చారు. అదేరోజు సోదరి, ఆమె కుమార్తెను తీసుకొని బంజారాహిల్స్‌లోని ఆసుపత్రికి వెళ్లాడు. కారు పార్కింగ్ చేయడానికి వారిద్దరినీ రిసెప్షన్ వద్ద వదిలేసి వెళ్లాడు. తిరిగొచ్చే సరికి సదరు ఇద్దరూ కనిపించలేదు. ఫోన్‌చేయగా తాను బాత్‌రూంలో ఉన్నని నిషా మెసేజ్ చేసింది. అయితే ఎంత సేపటికీ ఆమె రాకపోవడంతో అనుమానంతో బాత్‌రూంలో వెతికాడు. కానీ వారి ఆచూకీ కనిపించలేదు. కరీంనగర్‌కు కూడా వెళ్లలేదని తెలుసుకున్నాడు. దీంతో ఈనెల 23న బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి 4 జంటల్లో ఒకరికి సంతానోత్పత్తి సమస్య

డాక్టర్ దుర్గా జి.రావు



బేగంపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో పలు కారణాలతో ప్రతి నాలుగు జంటల్లో ఒకరు సంతానోత్పత్తి సమస్యలు ఎదుర్కొంటున్నారని ఒయాసిస్ ఫెర్టిలిటీ వ్యవస్థాపకులు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ దుర్గాజిరావు వెల్లడించారు. గురువారం బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సంతానలేమి సమస్యలకు శాస్త్రీయతతో కూడిన వైద్యం అందించడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయన్నారు. నవంబరులో నగరంలో ఒయాసిస్‌లో జరిగే ఓ కార్యక్రమంలో ఐవీఎఫ్ ద్వారా జన్మించిన ప్రతిభావంతులైన 10 మంది పిల్లలను ఎంపిక చేసి, వారిలో ఒక్కొక్కరికి రూ.50 వేల ఉపకార వేతనాలు అందిస్తామన్నారు. ఈ సమావేశంలో సంస్థ ఎండీ కిరణ్ గాదెల, సీఈవో పుష్కరరాజ్ షెనాయ్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో సదరు ఉత్సవాలకు ఎంతో ప్రత్యేకత


ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ అల్లాస్ జానయ్య

ఎర్రగడ్డ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నిర్వహించే సదరు ఉత్సవాలకు ఎంతో ప్రత్యేకత ఉందని మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. ఎర్రగడ్డకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎ.యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు గురువారం అంజన్‌కుమార్ యాదవ్‌ను కలిసి ఎర్రగడ్డలో నవంబర్ 1న నిర్వహించే సదర్ ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం దీపావళి తర్వాత నగరంలో పలు యాదవ సంఘాల ఆధ్వర్యంలో ఇతర రాష్ట్రాల నుంచి దున్నపోతులను తెచ్చి సదర్ ఉత్సవాలను వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. సదర్ ఉత్సవాల నిర్వాహకులకు తనవంతు సహకారం ఉంటుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కె.యాదయ్యయాదవ్, కె.లాలూప్రసాద్ యాదవ్, అనిల్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

జంతువుల కొవ్వుతో నూనె తయారు చేస్తున్న వ్యక్తి అరెస్టు

మంగళ్‌హాట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జంతువుల కొవ్వుతో నూనె తయారు చేసి మార్కెట్లో అమ్మకానికి పెడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. సుభాన్‌పురాలో నివాసముండే మహ్మద్ ఫజల్ మదాని తన ఇంటి వద్ద డాల్డా, జంతువుల కొవ్వుతో నూనె తయారు చేస్తున్నాడు. తీవ్రదుర్వాసన వస్తుందని స్థానికుల నుంచి సమాచారం అందుకున్న హబీబ్‌నగర్ పోలీసులు గురువారం దాడిచేసి 15 కిలోల కల్తీ నూనె డబ్బాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి, కేసులు నమోదు చేశారు.

గత సంవత్సరం టార్గెట్లు పూర్తి చేయాల్సిందే



ఉపకమిషనర్లు, ఇతర అధికారులతో సమావేశమైన జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి

ఖైరతాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను వసూళ్లపై లక్ష్యాలు విధించి వాటిని అధిగమించేందుకు కృషిచేయాలని జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి సూచించారు. గురువారం ఆయన ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో అన్ని సర్కిళ్ల ఉపకమిషనర్లు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత సంవత్సరం అక్టోబరు వరకు వసూలైన లక్ష్యాలను ఎందుకు చేయలేకపోయారని అధికారులను ప్రశ్నించారు. బీసీలు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పన్ను చెల్లించని వారి వివరాలను సేకరించి కట్టేలా చేయాలన్నారు. కమర్షియల్ ట్యాక్స్ బకాయిదారులపై ప్రత్యేకదృష్టి సారించాలని కోరారు. అక్టోబరు నెలాఖరు వరకు లక్ష్యాలను పూర్తి చేయాల్సిందేనని ఆదేశించారు.

నేడు, రేపు ఏఎన్‌ఎం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, గిరిజన వసతి గృహాల్లో ఏఎన్‌ఎం (ఔట్‌సోర్సింగ్) పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈ నెల 25, 26 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో పరిశీలిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. గత ఏడాది హైదరాబాద్ జిల్లాలోని గిరిజన వసతి గృహాల్లో ఏఎన్ఎం పోస్టులపై ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు మాత్రమే హాజరు కావాలన్నారు. అభ్యర్థుల నివాసం, కులం, స్టడీ, బోనఫైడ్, విద్యార్హతలు తదితర సర్టిఫికెట్స్ ఒరిజినల్, జిరాక్స్ కాపీలను తీసుకురావాలని సూచించారు.

గుట్కా తయారు చేసి, విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

చాంద్రాయణగుట్ట అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా గుట్కా తయారు చేసి విక్రయిస్తున్న ఇద్దరిని ఫలక్‌నూమ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఫలక్‌నూమ ఫాతిమానగర్‌కు చెందిన సయ్యద్ ఇమ్రాన్(32), శాలిబండ ఖాజీపురాకు చెందిన మహ్మద్ జుబైర్(29) తీగలకుంట అన్సారీ రోడ్డులోని ఓ ఇంట్లో నిషేధిత గుట్కా తయారు చేస్తూ విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారంతో గుట్కా తయారీ కేంద్రంపై పోలీసులు దాడిచేశారు. సుమారు రూ. 2,10,000 విలువ గల గుట్కా తయారీ మిషన్, పాన్‌మసాలాను స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ ఎంఏ జావీద్, ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి ఆదేశాల మేరకు కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

'రంజని దసరా- దీపావళి' సంచిక ఆవిష్కరణ నేడు

ఖైరతాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రంజని తెలుగు సాహితీ సమితి వారి దసరా-దీపావళి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ శుక్రవారం జరగనుంది. ఏజీ ఆఫీసు ఆరుబయట రంగస్థల వేదిక వద్ద శుక్రవారం మధ్యాహ్నం 1.05 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ వెలుదండ నిత్యానందరావు ముఖ్య అతిథిగా హాజరవుతారని రంజని ప్రధానకార్యదర్శి వెంకటరమణ తెలిపారు. ఇందులో ప్రముఖ రచయితలు డాక్టర్ పాలకోడేటి సత్యనారాయణరావు, పీఎస్ఎం లక్ష్మికి జీవన సాఫల్య పురస్కారాలను అందజేస్తారని, ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని ఆయన పేర్కొన్నారు.

పారామెడికల్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పారామెడికల్ కాలేజీల్లో పారామెడికల్ డిప్లొమా కోర్సుల అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చునని, అన్ని సర్టిఫికెట్లు జతపరిచి రూ.100 నగదు చెల్లించి ప్యాట్నీ సెంటర్‌లోని హరిహర కళాభవన్ 4వ అంతస్తులో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. తెలంగాణ మెడికల్ బోర్డు వెబ్‌సైట్ www.tgpmb.telangana.gov.in నుంచి దరఖాస్తులను పొందవచ్చునని, వీటిని ఈనెల 30వ తేదీలోగా సమర్పించాలని కోరారు.

ఈషా హోం స్కూల్‌పై ఆరోపణలను ఖండిస్తున్నాం

విద్యార్థుల తల్లిదండ్రులు

పంజాగుట్ట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరులోని ఈషా ఫౌండేషన్, హోంస్కూల్‌లో చదువుతోపాటు సంస్కారం నేర్పుతున్నారని ఈషా హోంస్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులు అన్నారు. గతంలో హోంస్కూల్‌లో స్వచ్ఛంద ఉపాధ్యాయురాలిగా పనిచేసిన మహిళ చేసిన ఆరోపణలు అవాస్తవమని, వాటిని ఖండిస్తున్నామని చెప్పారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు జె.రాధిక, జీవీ.వినోద్, వంశీ, వి.రాధిక, పరిమళ తదితరులు మాట్లాడారు. తమ పిల్లలు చదువుతో పాటు సంస్కారం, ఆటలు, యోగా నేర్చుకుంటున్నారని అన్నారు. 2024లో ఓ స్వచ్ఛంద ఉపాధ్యాయురాలిని యాజమాన్యం విధుల నుంచి తొలగించడంతోనే ఆమె లేనిపోని ఆరోపణలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె హోంస్కూల్‌పై ఆరోపణలు చేయడంతో తమను బంధువులు, స్నేహితులు వాటి గురించి అడుగుతున్నారని, ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

అభివృద్ధి పేరుతో అంబేడ్కర్ విగ్రహం కనిపించకుండా కుట్ర

పంజాగుట్ట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరుతో ట్యాంక్‌బండ్‌పై ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహం కనిపించకుండా కుట్ర చేస్తున్నారని మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్ ఆరోపించారు. అంబేడ్కర్ విగ్రహం కనిపించకుండా చేస్తే ఊర్కోబోమని ఆయన హెచ్చరించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు దళితసంఘాల నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రపంచంలో, దేశంలో ఎక్కడైనా మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే ట్యాంక్ బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్దనే ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు. 13 సంవత్సరాలుగా ప్రభుత్వానికి సంబంధం లేకుండా ప్రతి రోజూ శుభ్రంచేసి, మహనీయునికి పూలమాలలు వేస్తున్న ఏకైక విగ్రహం అంబేడ్కర్ విగ్రహమేనని అన్నారు. విగ్రహం కనిపించకుండా చుట్టూ గోడ కడితే ఊరోబోమని ఆగ్రహించారు. తమ వెనుకాల కేటీఆర్, నాయకులు ఉన్నారని రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ ఆరోపిస్తున్నారని, ఆయన తమకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. విగ్రహం వెనకాల సుందరీకరణ పనులు చేసి దానికి అంబేడ్కర్ ప్రాంగణం అని పేరు పెట్టాలని కోరారు. ఈ సమావేశంలో ఉమాకాంత్‌రావు, దాసరి విశాల్, నర్సింహయ్య, మణిదీప్, సత్యనారాయణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి 4 జంటల్లో ఒకరికి సంతానోత్పత్తి సమస్య

● డాక్టర్ దుర్గా జి.రావు



బేగంపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో పలు కారణాలతో ప్రతి నాలుగు జంటలలో ఒకరు సంతానోత్పత్తి సమస్యలు ఎదుర్కొంటున్నారని ఒయాసిస్ ఫెర్టిలిటీ వ్యవస్థాపకులు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ దుర్గాజిరావు వెల్లడించారు. గురువారం బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సంతానలేమి సమస్యలకు శాస్త్రీయతతో కూడిన వైద్యం అందించడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయన్నారు. నవంబరులో నగరంలో ఒయాసిస్‌లో జరిగే ఓ కార్యక్రమంలో ఐవీఎఫ్ ద్వారా జన్మించిన ప్రతిభావంతులైన 10 మంది పిల్లలను ఎంపిక చేసి, వారిలో ఒక్కొక్కరికి రూ.50 వేల ఉపకార వేతనాలు అందిస్తామన్నారు. ఈ సమావేశంలో సంస్థ ఎండీ కిరణ్ గాదెల, సీఈవో పుష్కరరాజ్ షెనాయ్ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాకి బీజేపీ పిలుపు

చిలకలగూడ, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): మూసీ బాధితులకి అండగా బీజేపీ శుక్రవారం ఇందిరా పార్కు, ధర్నా చౌక్ వద్ద వేలాది మందితో తలపెట్టిన మహాధర్నాకి భారీ ఎత్తున తరలి రావాలని బీజేపీ మహాకాళి జిల్లా అధికార ప్రతినిధి శారదా మల్లేష్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్ల కూల్చివేతలను అడ్డుకుంటామని, మూసీ బాధితులకి అండగా నిలుస్తామని నాయకులు, కార్యకర్తలు, వివిధ మోర్చాలు ప్రతినిధులు పాల్గొనాలని తెలిపారు.

నేడు, రేపు ఏఎన్‌ఎం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, గిరిజన వసతి గృహాల్లో ఏఎన్‌ఎం (ఔట్‌సోర్సింగ్) పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈ నెల 25, 26 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో పరిశీలిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. గత ఏడాది హైదరాబాద్ జిల్లాలోని గిరిజన వసతి గృహాల్లో ఏఎన్‌ఎం పోస్టులపై ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు మాత్రమే హాజరు కావాలన్నారు. అభ్యర్థుల నివాసం, కులం, స్టడీ, బోనఫైడ్, విద్యార్హతలు తదితర సర్టిఫికెట్స్ ఒరిజినల్, జిరాక్స్ కాపీలను తీసుకురావాలని సూచించారు.

ఆన్‌లైన్‌లో ల్యాప్‌టాప్ ఆర్డర్ చేస్తే పార్శిల్‌లో నాపరాయి

దుండిగల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో ల్యాప్‌టాప్ ఆర్డర్ చేసిన వినియోగదారునికి వచ్చిన పార్శిల్ చూసి షాక్‌కు గురయ్యాడు. దుండిగల్ గ్రామానికి చెందిన బి.ప్రవీణ్ ఈనెల 21న అమేజాన్‌లో ల్యాప్‌టాప్ ఆర్డర్ చేశాడు. గురువారం పార్శిల్ రాగా అది విప్పి చూడగా అందులో నాపరాయి, పాత విరిగిపోయిన ల్యాప్‌టాప్ కీబోర్డు కనిపించడంతో ప్రవీణ్ కంగుతిన్నాడు. దీంతో దుండిగల్ పోలీసులకు ప్రవీణ్ ఫిర్యాదు చేయగా, అన్ని ఆధారాలతో సైబర్‌క్రైమ్‌లో ఫిర్యాదు చేయమని ఆయనకు సూచించారు.

అదుపు తప్పి స్తంభాన్ని ఢీకొట్టి..

● ఒకరు మృతి.. మరొకరికి గాయాలు

మూడుచింతలపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం అల్వాల్ బొల్లారం ప్రాంతానికి చెందిన బ్రహ్మయ్య(44), నర్సింహులు ద్విచక్ర వాహనంపై నగరంలోని బొల్లారం నుంచి బాబాగూడ వైపు వస్తున్నారు. బాబాగూడ శివారులోకి రాగానే అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ ఇద్దరిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే బ్రహ్మయ్య మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

బర్కత్‌పుర, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని కాచిగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ కె.సుభాష్ వివరాల ప్రకారం.. కాచిగూడ డీమార్ట్ వద్ద ఫుట్‌పాత్‌పై 50 ఏళ్ల వయసు గల వ్యక్తి చనిపోయి ఉన్నాడు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



పురస్కారం బహూకరించిన నిత్యానందరావు

'సాహిత్యప్రతిభతో పద్మభూషణ్ స్థాయికి బోయిభీమన్న'

చిక్కడపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తన సాహిత్యప్రతిభతో పద్మభూషణ్ స్థాయికి బోయిభీమన్న ఎదిగారని తెలుగు విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ డా. వెలుదండ నిత్యానందరావు అన్నారు. భీమన్న సాహితీ నిధి, కళానిలయం ఆధ్వర్యంలో గురువారం రాత్రి త్యాగరాయగానసభలో మహాకవి పద్మభూషణ్ బోయి భీమన్న జయంతి సందర్భంగా సాహితీవేత్త ఒలేటి పార్వతీశంకు భీమన్న పురస్కార ప్రదానం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నిత్యానందరావు పురస్కారం బహూకరించి మాట్లాడారు.

మెట్రో వాటర్‌బోర్డులో విలీనానికి
కంటోన్మెంట్ వాటర్ సెక్షన్ రెడీ

● ప్రతిపాదనలు కార్యరూపం దాల్చితే తాగునీటి వెతలకు శాశ్వత పరిష్కారం

సికింద్రాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్‌వాసులకు శుభవార్త. ఇన్నాళ్లూ కంటోన్మెంట్ ప్రజలు పడుతున్న నీటి వెతల నుంచి శాశ్వత విముక్తి లభించనుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మిగతా అన్ని ప్రాంతాల మాదిరిగానే కంటోన్మెంట్‌లో కూడా నీటి సరఫరా జరిగేందుకు మార్గం సుగమమైంది. గ్రేటర్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో జరుగుతున్నట్లుగానే కంటోన్మెంట్‌లో కూడా మెరుగైన మంచి నీటి వ్యవస్థ రూపొందనుంది. కంటోన్మెంట్‌లో తాగునీటి సరఫరా మెరుగు పడడానికి, గ్రేటర్‌లోని ఇతర ప్రాంతాలతో సమానంగా నీటి సరఫరా చేయడానికిగాను సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని తాగునీటి విభాగాన్ని హైదరాబాద్ మెట్రోవాటర్ బోర్డులో విలీనం చేయాలన్న స్థానికుల దీర్ఘకాలిక డిమాండ్ త్వరలో నెరవేరనుంది. హైదరాబాద్ మెట్రోవాటర్ బోర్డులో సికింద్రాబాద్ కంటోన్మెంట్ వాటర్ సెక్షన్‌ను విలీనం చేయాలన్న ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. వాటర్ సెక్షన్ విభాగాన్ని విలీనం చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు తాజాగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు యంత్రాంగం ప్రభుత్వానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది.



బాలంరాయిలోని కంటోన్మెంట్ పంప్‌హౌజ్

కేంద్ర రక్షణ శాఖ కనుసన్నల్లో..

గ్రేటర్ హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ కేంద్ర రక్షణ శాఖ కనుసన్నల్లో నడుస్తోంది. జంటనగరాల్లోని ఇతర ప్రాంతాల్లో హైదరాబాద్ మెట్రోవాటర్ బోర్డుద్వారా తాగునీటి సరఫరా జరుగుతుండగా, ఇక్కడ మాత్రం కంటోన్మెంట్ బోర్డు ద్వారానే జరుగుతోంది. మెట్రోవాటర్ బోర్డు నుంచి తాగునీటిని కొంటూ, సొంత రిజర్వాయర్లు, పంప్‌హౌజ్‌లకు తెప్పించుకుని, అక్కడి నుంచి కంటోన్మెంట్‌లోని 8 వార్డులకు నీటి సరఫరా చేస్తోంది. కాగా దాదాపు ఐదు లక్షల జనాభాకు తగ్గట్టుగా కంటోన్మెంట్‌లో తాగునీటి వ్యవస్థ లేక నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. గ్రేటర్‌లోని అన్ని ప్రాంతాల్లో రోజు విడిచి రోజు నీటి సరఫరా జరుగుతుండగా, ఇక్కడ మాత్రం 3, 4 రోజులకోసారి.. అదీకూడా గంట, గంటన్నరసేపు మాత్రమే సరఫరా జరుగుతోంది. ఈ సమస్యలన్నింటికి చెక్ పెట్టడానికి కంటోన్మెంట్ నీటి విభాగాన్ని హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డులో కలిపేయాలంటూ ఎన్నో ఏళ్లుగా స్థానికులు, రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేస్తూ వచ్చారు. అయితే ఈ దిశగా ఇప్పటి వరకూ గట్టి ప్రయత్నాలు చేయలేదు. కాగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచే కంటోన్మెంట్ బోర్డుకు ప్రతిపాదన వచ్చినట్టు తెలిసింది. దీనికి కంటోన్మెంట్ బోర్డు యంత్రాంగం సుముఖత వ్యక్తం చేసినట్టు సమాచారం.

ప్రతిపాదనలకు అంగీకారం

కొద్ది సంవత్సరాల క్రితం సికింద్రాబాద్ కంటోన్మెంట్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు నిర్వహించిన అజిత్‌రెడ్డి ప్రస్తుతం ముఖ్యమంత్రి సలహాదారుగా ఉండడం, కంటోన్మెంట్ గురించి ఆయనకు పూర్తి అవగాహన ఉన్న నేపథ్యంలో తాగునీటి విభాగం ప్రతిపాదన తెరపైకి వచ్చిందని తెలిసింది. దీనిపై కంటోన్మెంట్ బోర్డు ఉన్నతాధికారులను సంప్రదించగా, ఈ ప్రతిపాదనలకు వారు అంగీకరించినట్టు తెలిసింది. దాంతో తాజాగా తాగునీటి విభాగానికి సంబంధించిన సమగ్ర నివేదికను కంటోన్మెంట్ ప్రభుత్వానికి పంపినట్టు సమాచారం. ప్రస్తుతం సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో 34వేల నీటి కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో 18వేల కనెక్షన్లు ఉచిత నీటి సరఫరా పరిధిలో ఉన్నాయి. మెట్రోవాటర్ బోర్డులో విలీనం జరిగితే సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో మంచినీటి సరఫరా మెరుగు పడడం ఖాయమని చెప్పవచ్చు. ముఖ్యంగా నిధుల కొరత తీరనుంది.



బొల్లారం రిసాల బజార్‌లో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న కంటోన్మెంట్ బోర్డు అధికారులు

అనుమతులు లేకుండా భవనాలు నిర్మిస్తే చర్యలు

● చీఫ్ ఇంజనీర్ ఉమాశంకర్

తిరుమలగిరి, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని కంటోన్మెంట్ బోర్డు చీఫ్ ఇంజనీర్ ఉమాశంకర్ అన్నారు. గురువారం బొల్లారం రిసాల బజార్‌లోని ఓ యజమాని భవనాన్ని అనుమతి లేకుండా నిర్మించడంతో బోర్డు సిబ్బంది, ఇంజనీరింగ్ విభాగం అధికారులు కూల్చివేశారు. కంటోన్మెంట్ బోర్డు నియమ నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకున్న భవన యజమానులకు అనుమతులు మంజూరు చేస్తున్నామని చీఫ్ ఇంజనీర్ తెలిపారు.

చెరువును తలపిస్తోన్న మహ్మద్‌గూడ

● సీతాఫల్‌మండి డివిజన్‌లో పర్యటించిన మేకల సారంగపాణి, సామల హేమ

బౌద్ధనగర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ మహ్మద్‌గూడలో డ్రైనేజీతో మురుగునీరు వరదలై పారుతూ చెరువులను తలపిస్తున్నాయని బీజేపీ మహాకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహ్మద్‌గూడ ప్రాంతంలో బీజేపీ నాయకులతో కలిసి గురువారం ఆయన పర్యటించారు. మ్యాన్‌హోల్స్ పొంగి రోడ్డుపై చెరువులను తలపిస్తున్న మురుగునీటిని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ సంబంధిత ఎమ్మెల్యే గాని, అధికారులుగాని మురుగు సమస్యను పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీమోర్చా నాయకుడు దేవుడు కుమార్, ఈఎల్ ప్రతాప్‌కుమార్ పాల్గొన్నారు.

త్వరగా పరిష్కరిస్తాం : జలమండలి ఎండీ

సీతాఫల్‌మండి డివిజన్ మహ్మద్‌గూడ ప్రాంతంలో జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్, స్థానిక కార్పొరేటర్ సామల హేమ గురువారం పర్యటించారు. మహ్మద్‌గూడ నాలా వద్ద తరచూ మురికినీరు ఉప్పొంగుతూ, రోడ్డుపై నీరు నిల్వ ఉంటోందని దీనిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ హేమ, జలమండలి ఎండీకి సూచించారు. నూతన పైపులైన్లు ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. త్వరలో ప్రణాళికలు రూపొందించి సమస్యను వీలైనంత తొందరగా పరిష్కారిస్తామని జలమండలి ఎండీ తెలిపారు. అనంతరం ఆయన, కార్పొరేటర్ స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్ వినోద్, మేనేజర్లు ప్రియాంక, నవ్య, నాయకులు జాకీర్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై నిలిచిపోయిన మురుగునీటిని పరిశీలిస్తున్న బీజేపీ మహాకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి



మహ్మద్‌గూడలో పర్యటించి సమస్యలను తెలుసుకుంటున్న జలమండలి ఎండీ అశోక్, కార్పొరేటర్ సామల హేమ

'చిరునవ్వే చిగురించు' కవితా సంపుటి ఆవిష్కరణ

మారేడుపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): షేక్ నసీమా బేగం రచించిన 'చిరునవ్వే చిగురించు' కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం సికింద్రాబాద్, స్వీకార్ మల్టీ స్పెషాలిటీ సెంటర్‌లో గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ రచయిత తెలంగాణ సాహిత్య అకాడమీ, తొలి అధ్యక్షురాలు నందిని సిధారెడ్డి మాట్లాడుతూ కవితా సంపుటిలోని అంశాలన్నీ సమాజానికి ఉపయోగపడేలా స్ఫూర్తిదాయకంగా వున్నాయని, కవిత్వం ప్రజల్లో ప్రశ్నించే గుణాన్ని, కవితలు వివిధ సమస్యలను స్పృశిస్తూ ఆత్మవిశ్వాసం పెంపొందించేలా ఉన్నాయని తెలిపారు. కవులు సమాజంలోని పీడిత, తాడిత ప్రజల సమస్యలు కళ్లకి కట్టేలా రచనలు చేయాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో స్వీకార్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ డాక్టర్ పసుపులేటి హనుమంత రావు, వైస్ చైర్మన్ డాక్టర్ నిర్మలారావు, సినీ గేయ రచయిత డాక్టర్ వెనిగళ్ల రాంబాబు, సినీ నటుడు షఫీ, పాత్రికేయులు, రచయిత తిరునగరి శ్రీనివాస్, రచయితలు నస్రీన్ ఖాన్, సలీమా సంస్థ సిబ్బంది డాక్టర్ కృష్ణ, శ్రీనివాస్, వరలక్ష్మి, అనిత,మమత తదితరులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణలో రచయిత్రి షేక్ నసీమా బేగం, నందిని సిధారెడ్డి తదితరులు

బోడుప్పల్ చెరువులకు మహర్దశ

● మూడు చెరువులకు పునరుజ్జీవం

● రూ.10.50 కోట్లు మంజూరు చేసిన హెచ్‌ఎండీఏ

ఉప్పల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బోడుప్పల్ కార్పొరేషన్‌లోని చెరువులకు మహర్దశ వచ్చింది. దాంతో రాచెరువు, సుద్దకుంట, అల్మాస్‌కుంట చెరువుల రూపురేఖలు మారనున్నాయి. ఎన్నో ఏళ్ళ నిరీక్షణ అనంతరం బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ చొరవతో మూడు చెరువుల అభివృద్ధికి హెచ్‌ఎండీఏ రూ. 10.50 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. చెరువులకు తిరిగి పూర్వ వైభవం తీసుకొస్తున్నందుకు సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

● చెరువులకు పునరుజ్జీవం

బోడుప్పల్‌లోని మూడు చెరువులు చాలామటుకు కబ్జాల పాలయ్యాయి. ముఖ్యంగా సుద్దకుంట చెరువు 90 శాతానికి పైగా కను మరుగైంది. అ చెరువు ఇప్పుడు కేవలం ఒక నాలా లాగే మిగిలిపోయింది. కబ్జాల తొలగింపు ఎంత వరకు సాధ్యమవుతుందన్నది పక్కన పెడితే ప్రస్తుతం మిగిలిన స్థలాన్ని కొంత మేరకయినా అభివృద్ధి చేయాలన్నది స్థానికుల అభిమతం. అదే విధంగా రాచెరువు మాత్రం విస్తీర్ణంలో పెద్దదైనప్పటికీ అందులో ఒకప్పుడు విపరీతంగా పారిశ్రామిక వ్యర్థ జలాలు కలిసేవి. స్థానికుల కాలనీ వాసులతో రా చెరువు పరిరక్షణ కమిటీ ప్రతినిధులు చేపట్టిన ఉద్యమ ఫలితంగా చెరువు లో కాలుష్య జలాలు కలువకుండా చాలామటుకు అరికట్టగలిగారు. ఈ చెరువుపై బండ్, వాకింగ్ ట్రాక్ నిర్మించి గతంలోనే కొంత మేరకు చెరువు సుందరీకరణ పనులు చేపట్టినప్పటికీ ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదు. అయితే తాజాగా హెచ్‌ఎండీఏ మంజూరు చేసిన నిధులతోనైనా చెరువు సుందరీకరణ పనులు పూర్తయి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి వస్తుందని ఆశిస్తు న్నారు. ఇక అల్మాస్ కుంట పరిస్థితి కూడా అంతే. చాలా వరకు కబ్జా కోరల్లో చిక్కుకుంది. అయితే మంజూరైన నిధులు చెరువులకు పూర్వ వైభవం తీసుకొస్తాయా లేదా వేచి చూడాల్సిందే.



బోడుప్పల్ రా చెరువు

చెరువుల రూపురేఖలు మారుస్తాం

– అజయ్‌యాదవ్, బోడుప్పల్ మేయర్

బోడుప్పల్ చెరువుల రూపు రేఖలు మార్చి సుందరమైన చెరువులను ప్రజలకు అందించే బాధ్యత తీసుకున్నా. అందుకోసమే నేను మేయర్ పీఠం ఎక్కాక మొట్టమొదట చెరువులనే సందర్శించాను. మూడు చెరువులను సుందరీకరణ చేసేందుకు మేయర్ పదవి చేపట్టిన మరుసటి రోజు నుంచే ప్రభుత్వం నుంచి నిధులను మంజూరు చేసేందుకు నిరంతరం కృషిచేశా. ఇక పనులు మొదలయ్యేలా చూడడమే నా ప్రథమ కర్తవ్యం.



రోడ్డు నిర్మాణ పనుల కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ కందిశైలజ

అంబర్‌నగర్‌లో రోడ్డు పనులు ప్రారంభం

బౌద్ధనగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ డివిజన్ అంబర్‌నగర్‌లో గురువారం సీసీ రోడ్డు నిర్మాణపనులను కార్పొరేటర్ కందిశైలజ ప్రారంభించారు. సుమారు రూ.29లక్షల వ్యయంతో ఈ పనులను చేపడుతున్నామని కార్పొరేటర్ తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి, స్థానికులకు ఇబ్బందులు కలగకుండా రోడ్డు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, బెజ్జంకి రాజేష్, జగదీశ్, షమీ, కృష్ణకుమారి, భూలక్ష్మీ పాల్గొన్నారు.



హమాలీ బస్తీలో సమస్యను తెలుసుకుంటున్న కార్పొరేటర్ సునీత

సమస్యల పరిష్కారానికి చర్యలు

చిలకలగూడ, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ డివిజన్ హమాలీ బస్తీలో మురుగు నీటి సమస్య పరిష్కరించాలని గురువారం ఫిర్యాదు చేశారు. స్పందించిన కార్పొరేటర్ రాసూరి సునీత, డీజీఎం వెంకటేష్‌తో కలసి పరిశీలించి సమస్య పరిష్కరానికి తగు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.

ప్రగతిశీల సామ్యవాదశీలి గుంటూరు శేషేంద్ర

చిక్కడపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు శేషేంద్రశర్మ ప్రగతిశీల సామ్యవాదశీలి అని తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ప్రొ.టి.గౌరీశంకర్ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో గురువారం మహాకవి గుంటూరు శేషేంద్రశర్మ యాదిలో గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన సంస్మరణ సమావేశం జరిగింది.

పౌరులకు ఎలాంటి ఇబ్బందులు రానీయం

● తిరుమలగిరి మండల తహసీల్దార్ అశోక్ కుమార్



తిరుమలగిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి మండల కార్యాలయం పరిధిలోని పౌరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తున్నా మని తహసీల్దార్ అశోక్ కుమార్ అన్నారు. కార్యాలయానికి వచ్చిన అన్ని దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి సమయానికి అందజేస్తున్నామని ఆయన గురువారం 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడటానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

మండల పరిధిలోని ప్రభుత్వ స్థలాలను పరిరక్షించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. సెక్టార్ వైస్‌గా స్పెషల్ ఆర్‌ఐలను నియమించాం. ప్రతీరోజు ప్రభుత్వ స్థలాలను పరిశీలించి సాయంత్రం తనకు ఫొటోలతో సహ రిపోర్ట్ అందిస్తున్నారు. కబ్జాలకు గురైనట్టు తెలిస్తే వెంటనే పోలీస్ సహకారంతో కూల్చివేసి స్వాధీనం చేసుకుంటున్నాం.

స్థలాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారా?

గుర్తించిన ప్రభుత్వ స్థలాల్లో ప్రభుత్వానికి చెందిన స్థలం అంటూ సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నాము. దీంతో పాటు స్థలం చుట్టూరా ఫెన్సింగ్ వేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

కబ్జారాయుళ్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు

ప్రభుత్వ స్థలంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేసినా వాటిని తొలగించి కబ్జాకు పాల్పడుతున్న వారిపై రెవెన్యూ చట్టం ప్రకారం లాండ్ గ్రాబింగ్ కేసులను నమోదు చేసి కఠినంగా శిక్షించడానికి చర్యలు చేపడుతున్నాం.

పురాతన బావులను కాపాడటానికి ఎలాంటి కృషి చేస్తున్నారు?

తిరుమలగిరి మండల కార్యాలయం పరిధిలో పురాతన బావులు ప్రస్తుతం లేవు. అవన్నీ కనుమరుగయ్యాయి.
ప్రస్తుతం మండల కార్యాలయం పరిధిలో బోయిన్‌పల్లిలోని రామన్నకుంట, తిరుమలగిరి చెరువు అనే రెండు చెరువులు మాత్రమే ఉన్నాయి.

చెరువులను కాపాడటానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

బోయిన్‌పల్లిలోని రామన్నకుంట ఎఫ్టీఎల్, బఫర్ జోన్ అదే విధంగా తిరుమలగిరి చెరువు ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌లు ఆక్రమణకు గురికాకుండా పరిశీలిస్తున్నాం. గతంలో కబ్జాకు గురైనట్లు మా దృష్టికి వస్తే స్వాధీనం చేసుకుంటాం.

మండల పరిధిలో నాలాల పరిస్థితి ఏమిటి?

నాలాల గుండా వర్షం నీరు సరిగా వెళ్లడానికి పౌరులు సైతం కృషి చేయాలి. నాలా లను కబ్జా చేసి కట్టడాలు చేపడితే మా దృష్టికి వచ్చిన వెంటనే కూల్చి వేస్తాం.

లాండ్ బ్యాంక్‌లో ఉన్న స్థలాలను రక్షించడానికి చర్యలేంటి?

ప్రభుత్వ స్థలాలుగా గుర్తించిన వాటిని లాండ్ బ్యాంక్‌లో పొందుపరిచి శాటిలైట్‌కు అనుసంధానం చేశాం.

పౌరులకు కుల, ఆదాయ, నివాస ధ్రువ పత్రాలు సరైన సమయంలో అందిస్తున్నారా?

ధ్రువపత్రాలు మీ సేవ ద్వారా మా కార్యాలయానికి అందగానే దరఖాస్తులను పరిశీలించి పౌరులకు అందజేస్తున్నాం. దీంతో పాటు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కూడా సకాలంలో అందజేస్తున్నాం.

వీధి వ్యాపారులకు భరోసా కల్పించాలి

● బీజేపీ నాయకుడు ఉమేశ్వరరావు

మారేడుపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ బోర్డు పరిధిలో చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్న స్ట్రీట్ వెండర్స్ (వీధి వ్యాపారాలు) కు బోర్డు పరమైన నిబంధనలు వర్తింపజేస్తూ 2014 స్ట్రీట్ వెండర్స్ యాక్ట్‌ను అమలు చేయాలని ప్రముఖ సామాజికవేత్త, బీజేపీ సీనియర్ నాయకుడు జెట్టి ఉమేశ్వరరావు కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధకర్ నాయక్‌ను కోరారు. ఈ మేరకు గురువారం సీఈఓ మధుకర్ నాయక్‌ను స్ట్రీట్ వెండర్స్‌తో కలిసి ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా స్ట్రీట్ వెండర్స్ చేసే చిరు వ్యాపారాలపై బోర్డు అధికారులు నిత్యం తనిఖీలు చేయడంతో వారు అభద్రతాభావానికి లోనవుతూ వీధి వ్యాపారాలను సక్రమంగా నిర్వహించుకోలేని పరిస్థితికి దిగజారుతున్నారని అన్నారు. ఈ క్రమంలో వారికి భరోసా కల్పించి బోర్డుపరమైన నిబంధనలను వర్తింపజేస్తూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆత్మనిర్భర్, మెప్మా ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలను కూడా వర్తింపజేయాలని వినతి పత్రంలో కోరారు.



సీఈఓ మధుకర్ నాయక్‌కు విజ్ఞప్తి చేస్తున్న బీజేపీ నాయకుడు జెట్టి ఉమేశ్వరరావు

బిట్స్‌పిలానీలో ఇండో ఫ్రెంచ్ సదస్సు ప్రారంభం

బిట్స్‌పిలాని, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని బిట్స్ పిలానీ క్యాంపస్‌లో మూడు రోజులపాటు నిర్వహించనున్న ఇండో ఫ్రెంచ్ సదస్సు గురువారం ప్రారంభమైంది. సదస్సు ఈ నెల 26వ తేదీ వరకు కొనసాగనుంది. గ్రీన్ ఎనర్జీ, స్వచ్ఛమైన పర్యావరణంపై సదస్సులో చర్చించనున్నారు. మొదటి రోజు సదస్సుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రక్షవీర్ జస్రా ముఖ్య అతిథిగా హాజరు కాగా, బిట్స్ పిలానీ ప్రొఫెసర్ సౌనక్‌రాయ్, ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ పాస్కల్, బిట్స్ పిలానీ డైరెక్టర్ సౌమ్యముఖర్జీ, ప్రొఫెసర్ జయంతి సుబ్బలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో భారతీయ, ఫ్రెంచ్ శాస్త్రవేత్తల పరస్పర సహకారంతో గ్రీన్ ఎనర్జీపై పరిశోధనలు కొనసాగడానికి దోహదం చేస్తుందన్నారు.

కార్యక్రమంలో బిట్స్ పిలానీ డైమండ్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా జరుగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.

పారామెడికల్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పారామెడికల్ కాలేజీల్లో పారామెడికల్ డిప్లొమా కోర్సుల అడ్మిషన్ల కోసం దరఖాస్తులు సమర్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చునని, అన్ని సర్టిఫికెట్లు జతపరిచి వంద రూపాయల నగదు చెల్లించి ప్యాటీ సెంటర్‌లోని హరిహర కళాభవన్ 4వ అంతస్తులో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. తెలంగాణ మెడికల్ బోర్డు వెబ్‌సైట్ www.tgpmb.telangana.gov.in నుంచి దరఖాస్తులను పొందవచ్చునని, వీటిని ఈనెల 30వ తేదీలోగా సమర్పించాలని కోరారు.